మినీ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.

# గుండె ఝల్లు

## పి. శ్రీనివాస శాస్త్రి

"ధరలూ! ధరలూ! మీరెందుకలా పెరిగిపోతున్నారు?"

"కారణం పాలకులు"

"పాలకులూ! పాలకులూ! మీరు ధరలెందుకు తగ్గించడం లేదు?"

"కారణం ద్రవ్యోల్బణం"

"ద్రవ్యోల్బణమా! ద్రవ్యోల్బణమా! నువ్వెందుకలా బలిసి పోతున్నావ్"

"కారణం గుప్త ధనం"

"గుప్త ధనమా! గుప్త ధనమా! నువ్వెందుకు చావటం లేదు"

"కారణం గుత్త పెట్టుబడిదారులు"

"గుత్త పెట్టుబడిదారులూ గుత్త పెట్టుబడిదారులూ! మీరెందుకు గుప్తధనం మేటలు వేస్తున్నారు,"

"కారణం పరపతి విధానంలో లోపాలు"

"పరపతి విధానం! పరపతి విధానం నువ్వెందుకు లోపాలు కోపాలతో ఉన్నావ్!"

"కారణం బ్యాంకులు"

"బ్యాంకులూ! బ్యాంకులూ! మీరెందుకలా పరపతి విధానం బిగ పెట్టుకూర్చున్నారూ"

"కారణం అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు"

"అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులూ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులూ మీరెప్పుడూ బాగుపడరేం"

"కారణం-ఐ. ఎమ్. ఎఫ్, వరల్డ్ బ్యాంక్ వగైరా అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థలు."

"అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థలు, అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థలూ, మీరెందుకలా చెలగాటాలాడుతున్నారు?"

"కారణం అమెరికా"

"అమెరికా అమెరికా నీ కెందుకీ దుర్బుద్ధీ"

"కారణం -రష్యా-"

"రష్యా రష్యా నీ కివేం పొయ్యేకాలం?"

"కారణం- అమెరికా"

"అమెరికా, అమెరికా నికదేం రోగం"



"కారణం- రష్యా-"

"రష్యా, రష్యా నీకిదేం సర్దా"

"కారణం అమె..."

"........ .."

"........."

ఇలా వీడని వాడూ వాడని మరొకడూ. మరోడని ఇంకొకడూ ..
ఇంకొకడని వేరొకడు వేరొకడని ఇదే.. ఇదని అదే. అదని ఇదీ.... ఇదనీ....

ఆ.... ఆహా భూమి గుండ్రంగా వుంది.!

ఏ సమస్యకైనా భూమి గుండ్రంగానే ఉంది !!!